# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# జాతీయ వార్తలు

తేదీ: 28-01-2025 సమయం : రాత్రి 8 గం. 30 ని. లు

## ముఖ్యాంశాలు

- ప్రధాన మంత్రి నరేంద్రమోడీ ఈరోజు భువనేశ్వర్‌లో 'ఉత్కర్ష్ ఒడిశా, మేక్ ఇన్ ఒడిశా కాన్‌క్లేవ్-2025'ను ప్రారంభించారు.

- పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల నేపథ్యంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము శుక్రవారం ఉభయ సభలనుద్దేశించి ప్రసంగిస్తారు.

- ఎగుమతులను పెంచడానికి లాజిస్టిక్ ఖర్చులను తగ్గించాల్సిన అవసరం ఉందని కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ పేర్కొన్నారు.

- ఉత్తరాఖండ్ లోని డెహ్రాడూన్ లో 38వ జాతీయ క్రీడల ప్రారంభోత్సవం ఈరోజు అట్టహాసంగా జరిగింది.

=========================

ప్రధాన మంత్రి నరేంద్రమోడీ ఈరోజు భువనేశ్వర్‌లోని జనతా మైదానంలో 'ఉత్కర్ష్ ఒడిశా, మేక్ ఇన్ ఒడిశా కాన్‌క్లేవ్-2025ను ప్రారంభించారు. భారతదేశంలో ఒడిశాను పెట్టుబడుల గమ్యస్థానంగానూ.. పారిశ్రామిక కేంద్రంగా మార్చే లక్ష్యంతో ఆ రాష్ట్ర ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. ఈ సదస్సులో ప్రధాన మంత్రి ప్రసంగిస్తూ.... ఒడిశా త్వరలో పారిశ్రామిక అభివృద్ధికి ప్రతిరూపంగా మారుతుందని అన్నారు. భారతదేశాన్ని ప్రపంచంలోనే 3వ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా మార్చడంలో ఒడిశా పాత్ర చాలా ముఖ్యమైనదని పేర్కొన్నారు. కేవలం ముడి సరుకుల ఎగుమతి ద్వారానే వేగవంతమైన వృద్ధి సాధ్యం కాదని ఈ ధోరణితో కూడిన పారిశ్రామిక వ్యవస్థను సమూలంగా మార్చాలని నరేంద్రమోడీ మాట్లాడుతూ...

(వాయిస్ 30 సెకన్లు)

=========================

పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల నేపథ్యంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము శుక్రవారం ఉదయం 11 గంటలకు ఉభయ సభలనుద్దేశించి ప్రసంగిస్తారు. అంతకంటే ముందు గురువారం అఖిలపక్ష సమావేశం జరగనుంది. అలాగే 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబందించిన కేంద్ర బడ్జెట్ ను ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ శనివారం లోక్ సభలో ప్రవేశ పెడతారు. రాష్ట్రపతి ప్రసంగానికి సంబంధించిన ధన్యవాద తీర్మానంపై ఫిబ్రవరి 3, 4, 5, 6 తేదీల్లో ఉభయ సభల్లో చర్చ చేపడతారు.

==========================

ఎగుమతులను పెంచడానికి లాజిస్టిక్ ఖర్చులను తగ్గించాల్సిన అవసరం ఉందని కేంద్ర రోడ్లు, రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ పేర్కొన్నారు. ప్రాజెక్ట్ అభయ్ పైలట్ ప్రాజెక్టును విజయవంతంగా పూర్తి చేయడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. దేశంలో ప్రస్తుతం 22 లక్షల మంది డ్రైవర్ల కొరత ఉందని ట్రక్ డ్రైవర్ల సంఖ్యను తక్షణమే పెంచాల్సిన అవసరాన్ని మంత్రి నితిన్ గడ్కారీ వివరిస్తూ ...

(వాయిస్ 30 సెకన్లు)

కాగా ప్రాజెక్ట్ అభయ్ అనేది దేశవ్యాప్తంగా ఉన్న ట్రక్ డ్రైవర్ల జీవితాలను మెరుగుపరిచేందుకు తీసుకున్న ఈ కార్యక్రమంలో 2024 లో 6 రాష్ట్రాలు, 15 నగరాల్లో మొత్తం 50 వేల మంది ట్రక్ డ్రైవర్లు లబ్ది పొందారు.

==========================

ప్రయాగ్ రాజ్ లో జరుగుతున్నా కుంభమేళాకు రేపు మౌని అమావాస్య సందర్భంగా భారీ సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం ఉండటంతో ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం భద్రతా ఏర్పాట్లను గణనీయంగా పెంచింది. ఏడు అంచెల భద్రతా ప్రణాళికను ప్రభుత్వం అమలు చేస్తోంది. మహాకుంభమేలా ప్రాంతాన్ని నో - విఐపి జోన్‌గా ప్రకటించారు. కుంభమేళా ప్రాంతంలో 328 AI - ఆధారిత కెమెరాలతో సహా దాదాపు 3 వేల CCTV కెమెరాలను ఏర్పాటు చేశారు. పారామిలిటరీ దళాలతో సహా 50 వేలకు పైగా పోలీసు సిబ్బందిని నియమించారు.

==========================

భారత జాలర్లను అరెస్టు చేస్తున్న సమయంలో శ్రీలంక నావికాదళం జరిపిన కాల్పుల ఘటనపై భారత్ తీవ్ర నిరసన వ్యక్తం చేసింది. న్యూఢిల్లీలోని శ్రీలంక తాత్కాలిక హైకమిషనర్ ను ఈ రోజు విదేశాంగ మంత్రిత్వ శాఖకు పిలిపించి ఈ ఘటనపై నిరసన తెలిపింది. కొలంబోలోని భారత హైకమిషన్ కూడా ఈ విషయాన్ని శ్రీలంక ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లిందని విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ పేర్కొంది. కాగా డెల్ఫ్ ద్వీపం సమీపంలో 13 మంది భారత జాలర్లను అదుపులోకి తీసుకున్న సమయంలో శ్రీలంక నావికాదళం కాల్పులు జరిపిన సంఘటన ఈరోజు తెల్లవారుజామున చోటు చేసుకుంది. పడవలో ఉన్న 13 మంది మత్స్యకారుల్లో ఇద్దరికి తీవ్ర గాయాలు కాగా ప్రస్తుతం వారు జాఫ్నా టీచింగ్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు.

విరామం

==========================

ఉత్తర ప్రదేశ్‌లోని బాగ్‌పట్‌లోని ఈరోజు జరిగిన ఒక ఆధ్యాత్మిక కార్యక్రమంలో తాత్కాలిక వేదిక కూలిపోవడంతో ఐదుగురు మరణించగా.. 40 మందికి పైగా గాయపడ్డారు. ఈ కార్యక్రమంలో పాల్గొనడానికి వచ్చిన భక్తులు వేదికపైకి ఎక్కినప్పుడు ఈ సంఘటన చోటు చేసుకుంది. దీంతో ఆ ప్రదేశంలో గందరగోళం నెలకొండంతో తొక్కిసలాట జరిగి అనేక మంది భక్తులు గాయపడినట్లు అధికారులు తెలిపారు. సహాయక చర్యలను వేగవంతం చేయాలని, గాయపడిన వారికి సరైన చికిత్స అందించాలని ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ అధికారులను ఆదేశించారు.

==========================

భారత విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (UAE) లో పర్యటిస్తున్నారు. అందులో భాగంగా అబుదాబిలో ఈరోజు జరిగిన రైసినా డైలాగ్ ప్రారంభోత్సవంలో ఆయన భారత్ - మధ్య ప్రాచ్య దేశాల మధ్య పెరుగుతున్న సంబంధాల ప్రాముఖ్యతపై మాట్లాడారు. గల్ఫ్ దేశాలతో భారత వార్షిక వాణిజ్యం 16 వేల కోట్ల డాలర్ల నుండి 18 వేల కోట్ల డాలర్లకు చేరుకుందని అన్నారు. 90 లక్షలకు పైగా భారతీయులు ఇక్కడ నివసిస్తున్నారని జయశంకర్ మాట్లాడుతూ...

(వాయిస్ 30 సెకన్లు)

==========================

ఉత్తరాఖండ్ లోని డెహ్రాడూన్ లో 38వ జాతీయ క్రీడల ప్రారంభోత్సవం ఈరోజు అట్టహాసంగా జరిగింది. ఈ కార్యక్రమాన్ని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ప్రారంభించారు. వచ్చే నెల 14 వరకు ఉత్తరాఖండ్ లోని 8 జిల్లాల్లోని మొత్తం 11 నగరాల్లో ఈ జాతీయ క్రీడలు జరగనున్నాయి. ఈ పోటీల్లో మొత్తం 35 ఆటలకు సంబంధించి 47 ఈవెంట్లు జరగనున్నాయి. ప్రారంభోత్సవానికి కేంద్రమంత్రులు, భారత ఒలింపిక్ సంఘం సభ్యులు, జాతీయ క్రీడాకారులు సహా పలువురు అతిథులు హాజరయ్యారు.

==========================

మలేషియా లోని కౌలాలంపూర్‌లోని బయుమాస్ ఓవల్ స్టేడియం వేదికగా జరుగుతున్న ఐసిసి అండర్-19 మహిళల టి20 ప్రపంచ కప్‌లో భాగంగా ఈరోజు జరిగిన మ్యాచ్‌లో స్కాట్లాండ్ పై భారత మహిళా జట్టు 150 పరుగుల తేడాతో విజయం సాధించింది. భారత్ నిర్దేశించిన 209 పరుగుల లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో స్కాట్లాండ్ 14 ఓవర్లలో 58 పరుగులకే ఆలౌట్ అయింది. అంతకుముందు, భారత జట్టు నిర్ణీత 20 ఓవర్లలో ఒక వికెట్ మాత్రమే కోల్పోయి 208 పరుగులు చేసింది. భారత్ తరఫున గొంగడి త్రిష 59 బంతుల్లో 110 పరుగులు చేసి నాటౌట్‌గా నిలిచింది.

ఇక పురుషుల క్రికెట్‌లో ఈరోజు గుజరాత్‌లోని రాజ్‌కోట్ వేదికగా భారత్ ఇంగ్లాండ్ జట్ల మధ్య జరుగుతున్న మూడవ టీ-20 మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన ఇంగ్లాండ్ జట్టు 20 ఓవర్లకు 9 వికెట్ల నష్టానికి 171 పరుగులు చేసింది. 5 మ్యాచ్‌ల సిరీస్‌లో భారత జట్టు ఇప్పటికే 2-0 ఆధిక్యంలో ఉంది.

==========================

న్యూఢిల్లీలోని విజయ్ చౌక్‌లో రేపు బీటింగ్ రిట్రీట్ వేడుక జరగనుంది. ఈ సంవత్సరం ఆర్మీ, నేవీ, వైమానిక దళం, కేంద్ర సాయుధ పోలీసు దళాల బ్యాండ్ల ఫుట్‌ట్యాపింగ్ సంగీతంతో 30 ప్రదర్శనలు ప్రేక్షకులను ఆకట్టుకుంటాయని రక్షణ మంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. ఈ వేడుకకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్, ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, ఇతర కేంద్ర మంత్రులు హాజరవుతారు.

==========================
==========================